# సాక్షి

బెల్లం చుట్టూ చీమలు పోగయినట్లు, మురికి గుంటమీద ఈగలు మూగినట్లు రోడ్డువారగా ఒకేచోట గుమిగూడిపోయిన పెద్ద గుంపు. గుంపులోంచి బయటకు వస్తున్న వాళ్లు పకపక నవ్వుకుంటు న్నారు. గుంపు వెనగ్గా వున్నవాళ్లు మునివేళ్ల మీద నిలబడి లోపలకు చూస్తున్నారు. బక్కపలచటి వాళ్లు, పిల్లకాయలూ మనుష్యుల సందు ల్లోంచి లోపలికి దూరేస్తున్నారు. గుంపు కేంద్రస్థానం నుంచి ఆగి.ఆగి వెకిలి నవ్వులు వినిపిస్తున్నాయి.

ఆఫీసులో ఫైళ్ల బరువంతా పొద్దున్నుంచీ మోసి, మోసి అలసి పోయిన సీతారామయ్యగారు రోజులాగే నెమ్మదిగా చీమలా పాక్కుంటూ ఆ దారమ్మట వస్తున్నారు. ఆయన రోజూ (ఆదివారం, తదితర శలవు దినాల్లో అందరూ ఇంటి దగ్గర ఎలా కాలక్షేపం చేస్తారో ఆయనకు అవ గతం కాని సంగతి) అలా పొద్దున్నించీ సాయంత్రం ఆరు, ఏడు,.....ఒక్కోసారి రాత్రి తొమ్మిదీ....దాకా ఆఫీసులోని ఫైళ్ల బరు వంతా మొయ్యాలని గత జన్మలో ఏ మహానుభావుడు శపించాడో మరి తెలియదు కానీ—యీ జన్మలో మాత్రం గత ముప్ఫయి సంవత్సరాలుగా శిక్ష ననుభవిస్తున్నారు. 'యావజ్జీవ కారాగార శిక్ష' దీనిముందు ఎంత అని ఆయన చాలాసార్లు అనుకున్నారు.

అందరిలాగే ఆయన దృష్టి ఆ గుంపు మీద పడింది. అందరి లాగే ఆయనకీ పకపకలూ, వెకిలినవ్వులూ వినిపించాయి. 'అందరూ వచ్చారు, యిహ నువ్వే తరవాయి.రా........' అని గుంపు తనని ఆహ్వానిస్తున్నట్లు అనిపించింది ఆయనకు. పైగా సినిమా, నాటకం... లాంటి రిక్రియేషన్స్ ఆయనకి చిన్నప్పట్నుంచీ అలవాటులేదు—ఒహా విధంగా చెప్పాలంటే తీరిక, డబ్బుకూడా చాలక, రోడ్డుపక్కన జరిగే మోళీ, పాములాట, .... మొదలయినవే ఆయనకి రిక్రియేషన్.

ఈనె పుల్లలా వున్నందువల్ల ఆయనే గుంపులోపలకు చీల్చుకు పోయారో, పెద్దమనిషి, సమస్య తీరుస్తాడు అన్నట్టుగా జనమే ఆయన్ని పోనిచ్చారో తెలియదుగానీ—మొత్తానికి ఆయన కేంద్రస్థానం సులభంగానే చేరారు. విషయం కొద్దిక్షణాల్లోనే అర్థమయ్యింది. తన జీవితంలో ఎప్పుడూ చూడని సంఘటన. కనీసం వినని సంఘటన. ఆయన కేవిటి, బహుశా ఎవ్వరికైనా యిది కనీ వినీ యెరుగని సంఘటనే మరి.

రోడ్డు వారగా ఓ టాక్సీ. దాంట్లో చీకట్లో లీలగా మెదుల్తూ ఓ యువతి. బయటకు వ్రేలాడుతూన్న చీరసరిగంచు, ఆమెకున్న గిల్టు నగలు చీకట్లో సిగిరెట్టు పెట్టెల్లో ముచ్చి రేకుల్లా మెరుస్తున్నాయి. టాక్సీ వారనే ఫుట్‌పాత్ మీద కూలబడి, చెట్టుకి జార్లపడి మోకాళ్లకీ, మోచేతులకీ భేటీపెట్టి, నడినెత్తిన అరచేతులు పెట్టుకున్న కాకీ బట్టల ఆసామీ....

ఇంతకీ సంగతేమిటయ్యా అంటే ఆ యువతి సికింద్రాబాద్‌లో ఓ పెద్ద హోటల్లోంచి వచ్చి, హిమయత్‌నగర్ పోనిమ్మని చెప్పి టాక్సీ యెక్కిందిట. అక్కడకు పోనిచ్చి, చార్‌మినార్ పోనివ్వమందట, అక్కణ్ణుంచి మళ్లీ యింకోచోటు. అక్కణ్ణుంచి యింకో చోటు.... ఎక్కడా....దిగదు. తన గమ్యమేదో సరిగ్గా చేరదు. చివరకు ఖైరతాబాద్ తీసుకొచ్చాక అతగాడికి అనుమానం దృఢమై, యిక్కడ ఆపు చేసేశాడు.

మీటర్ ముప్పయి రెండు రూపాయల అరవై పైసలు చూపిస్తోంది. ఆమె ఎక్కడికి వెళ్లాలో తెలియదు. ఒకచోట అని ఖచ్చితంగా చెప్పదు. దిగిపోయి, ఇంకో టాక్సీ చూసుకోమంటే చూసుకోదు. అసలు టాక్సీ దిగటంలేదు. అదీ సమస్య.

ఆమెను పలకరించబోయిన వాళ్లంతా ఆమె నోరు విప్పగానే ముక్కులు మూసుకుని వచ్చేస్తున్నారు. వాళ్లని చూసి మిగతా వాళ్ల నవ్వులు. ఆమె నోట్లోంచి దుర్వాసన. మనిషి బాగా తాగివుందని తెలుస్తోంది. అంతకీ రుమాళ్లు తమ తమ ముక్కులకి నొక్కిపట్టి, ఆమె నుంచి విషయం రాబట్టడానికి ప్రయత్నించారు. అసలు ఆమె మాతృ భాషేదో తెలియదు. అన్నిభాషల్లోనూ ఏదో అర్థం పర్ధం లేని జవాబు లిస్తోంది. ఒక్క భాషాసరిగ్గాలేదు. తనకితనేఏదో అనుకుని, ఆగిఆగి నవ్వు తోంది. తనని పలకరిస్తున్న వాళ్లు చాలనట్లు మిగిలిన వాళ్లని 'రమ్మ'ని సంజ్ఞలు చేసి ఏదో చెప్పి వెకిలిగా నవ్వుతోంది. ఇదోమాంచి కాలక్షే పంగా వున్న కాలక్షేపేశ్వరావులు బూతు జోకులు కూడా వేసి, ఆనందిస్తున్నారు. హోటల్లోంచి వచ్చిన మనిషి, అందులోనూ బాగా త్రాగి వుందంటే.........యింక అనుమానం ఎవడికుంటుంది? అసలు విషయం వదిలేసి, విషయాన్ని కొందరు తప్పుదారి పట్టిస్తున్నారు. కొందరు ఆమెని కళ్లతో త్రాగేస్తున్నారు.

ఇద్దరు ముగ్గురు మాత్రం ఆమెనుంచి అసలు విషయం రాబట్టడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నారు. పోనీ దిగిపోయి, అంత వరకూ అయిన మీటర్ చార్జి చెల్లించమన్నారు. ఆమె ఏదో అంది. ఎవరికీ అర్థం కాలేదు.

"డబ్బా అక్కర్లేదు, ఏ వల్లకాడూ అక్కర్లేదు—ఆ మనిషిని ముందసలు నాటాక్సీ లోంచి దిగమనండి చాలు బాబోయ్" అని తల తలు నొక్కుకుంటూ డ్రైవర్ మొరపెట్టుకున్నాడు.

ఆడమనిషి- అందులో వయసులో వున్నదయి పోయింది. ఏ ముసల్దో, మగవాడోఅయితే బలవంతంగానైనా లాగి రోడ్డుమీదపారె య్యొచ్చు.

ఆమెమీద చాలా జాలి చూపిస్తూన్నవాళ్లు కూడావున్నారు. ఎంత తాగివున్నా పాపం-ఆడమనిషి. తాగివున్న కారణంగా, అందులోనూ చీకటి పడటంతో ఎక్కడకువెళ్లాలో అడ్రస్సు సరిగ్గాచెప్పలేక పోతోందేమో! ఎంత మంచిమనిషి అయినా నైతికంగా దిగజారి పోవడానికి కారణాలు అనేకం అని వాళ్లల్లో వాళ్లు అనుకుంటున్నారు.

డ్రైవరు మంచితనానికీ, అమాయకత్వానికీ మొత్తం గుంపంతా ఏకంగా ఆశ్చర్యపోతోంది. అసలు యిలాంటి మనుష్యులు వుంటారా అనిపిస్తోంది అందరికీ.

"ఇదెక్కడి వింతండీ బాబూ! అసలుఆడది ఒక్కత్తీ టాక్సీ ఎక్కితే.... ఉం ··· మరి....వీళ్లు....తెలుసుకదామీకు. అలాంటిది యితను మరీ సత్తెకాలపు మనిషి. డబ్బులక్కర్లేదు. నాకార్ధం అక్కర్లేదు, నువ్వు నా టాక్సీ దిగితే ఆదే పదివేలు అంటున్నాడంటే...." ఒకాయిన తెరచిన నోరుముయ్యడం మరిచిపోయాడు.

"ఆఁ....బొత్తిగా వెర్రిపీనుగలా వున్నాడండీ ఆ ఆడమనిషి ఏ జాతిదో తెలిసిపోతోంది. పైగా తాగివుంది. తన అదృష్టానికి సంతో షించి, మాటాడకుండాతిన్నగా తీసుకెళ్లి, ఏ 'బోర్థల్'లోనో దిగబెట్టి, చేతులు దులుపుకుని జేబులు నింపుకుంటే అడిగేవాడెవడండీ?" అంటూ గుసగుసలాడాడు పక్కాయన.

సీతారామయ్యగారు అంతావిన్నారు. ఆయనకూడా తనకి పరిచయ మున్న అన్ని భాషల్లోనూ ఆమెని ప్రశ్నించిచూసారు. ఉహుఁ....ఏం ఫలితంలేదు.

"ఇదిగో అబ్బాయ్! ఓ టాక్సీడ్రయివరూ-ఇలాఎంతసేపుంటే ఏం ప్రయోజనం?! ఇహ ఇదిపనిగాదు. పోలీస్‌స్టేషన్‌కి తీసుకుపో నిమిషాల్లో

తేల్చేస్తారు ఈ సమస్యవాళ్లు. నామాటవిను. ఇహ వేరేమార్గంలేదు నీకు,” అన్నారాయన.

ఈ ఆలోచన అందరికీ వచ్చింది. ఆయన చెప్పిన సలహానే తమకి వచ్చిన ఐడియాలాగ కొత్త కొత్త పద ప్రయోగాలలో అతనికి చెప్పారు. అతగాడిలో కూడా కొంత హుషారొచ్చి లేచి నిలబడ్డాడు కానీ అంతలోనే బేలముఖం వేశాడు.

“పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్లడం ఆలోచన బాగానేవుందిసార్. కాని, ఆ మనిషి పరిస్థితి చూస్తున్నారు కదా. పోలీసువాళ్లకి ముందు నా మీద అనుమానం వచ్చి, ఆమెకి మత్తుదిగి యీలోకంలోకి వచ్చేవరకు స్టేషన్నుంచి కదలడానికి వీల్లేదంటారు. ఈటైములోనే మాకు నాలుగు బేరాలు తగిలేది. ఈ నష్టంమాట దేవుడెరుగు. వచ్చేడబ్బులు కూడాపోతా యండి బాబూ” అన్నాడు, టాక్సీడ్రైవరు దీనంగా ముఖంపెట్టి.

అతను చెప్పింది అక్షరాలానిజం అనిపించింది అందరికీ. మళ్లీ అంతా ఆలోచనలో పడ్డారు అతనుకిందకూలబడ్డాడు.

“ఆదికాదండి. డ్రైవరు ఒక్కడూ వెళ్తే పోలీసుస్టేషన్లో అట్టే పెట్టేస్తారని గదా మనం అనుకునేది. అందుకనే ఎవరో ఒకరు అతన్తోవెళ్లి, గంటనుంచీ కళ్లారాచూసిన యీ భాగోతం అంతా సాక్ష్యం చెప్పితేసరి. దాంతో కావలిస్తే టాక్సీ నెంబరు ఎక్కించుకుని వదిలేస్తారు. అంతగా రమ్మంటే మళ్లీ పొద్దున్నే డ్రైవరు స్టేషన్‌కి వెళ్తాడు” అన్నాడో మీసాలాయన.

“నెంబరు యెక్కించుకుని వదిలేసే మాటయితే, మళ్లీ కూడా సాక్షి యెందుకండీ....” ఈసమస్యకెలాగైనా తనే పరిష్కార మార్గం చూడా లని తంటాలు పడుతూన్న నీలంచొక్కా ఆయన విసుక్కున్నాడు.

“అలాకాదుసార్. పోలీసుస్టేషన్ గొడవమీకు తెలీదు. ఆయన చెప్పిందే బావుంది. దయచేసి ఎవరైనా నాకుతోడురండి” అన్నాడు డ్రైవరు వినయంగా.

ఇంకేం? సమస్య తీరిపోయింది- అన్నట్టుగా స్థంభించి పోయిన గుంపుకిచలనం కలిగింది. కాని సాక్ష్యానికి యెవ్వరూ ముందుకురాలేదు. దానివల్ల తమకి ఒదిగే నష్టమేదో వుందని వారు అనుకోకపోయినా ఎందుకొచ్చిన తద్దినం అని ఎవళ్లమట్టుకు వాళ్లు జారుకోసాగారు.

గంటనుంచీ తమ భాగోతంచూస్తున్న వాళ్లందర్నీ డ్రైవరు మరోమారు బ్రతిమాలాడు. అందరూ ఎవరిదారి వాళ్లు చూసుకుంటూంటే అతనికి బేజారుయెక్కువైనట్టుంది.

రావడానికేం లేదయ్యా! ముసలీముక్కీ-అయితే రావొచ్చు. వయస్సులోవున్న ఆడమనిషి. పరిస్థితిసరేసరి. వయస్సులో వున్నవాణ్ణి నేనొస్తే సమస్య మరింత జటిలం అవుతుంది. అదీగొడవ" అన్నాడు నీలంచొక్కా ఆయన.

'అదీ నిజమే' అంటూ మిగతా నలుగురైదుగురూ తామూ వయస్సులో వున్న వాళ్లమేనని నిరూపించుకోవడానికి నిటారుగా బోరలు విరిచి నిలబడ్డారు.

"మేష్టారూ! ఇక ఈ సమస్య మీతోనే పరిష్కరింపబడాలి. మేవంతా వయస్సులో వున్న వాళ్ళమే. మీరు ఒఖ్ఖమాట చెప్తేచాలు. ఆమెని వాళ్లు కస్టడీ లోకి తీసుకుని, అతన్ని వదలి పెడ్తారు. అతని అదృష్టం బావుంటే యిప్పుడు అయిన మీటరు ఛార్జి కూడా రేపొద్దున్న ఆమె చేత వాళ్లు యిప్పిస్తారు. చూస్తున్నారుగా—అతనంత సత్తెకాలపు మనిషై పోవడం వలన అలా బాధపడ్తున్నాడు. పాపం - ఆ మాత్రం అతనికి సాయపడి పుణ్యం కట్టుకోండి" అన్నాడు మీసాలాయన సీతారామయ్యగారితో.

ఓక్షణం ఏమీ మాట్లాడ లేక పోయారాయన.

"అతని పరిస్థితి చూస్తూంటే నిజంగా నాకూ జాలేస్తోంది. కానీ, అప్పుడే తొమ్మిది కావస్తోంది. నెమ్మదిగా నడుచు కుంటూ నేను

యింటికి చేరే సరికి యింకో అరగంటయినా పడ్తుంది. మరి అంతకంటే ఆలస్యమయితే పిల్లలు కంగారు పడతారు. అందుకని...." అతనికి సాయపడలేక పోతున్నందుకు లోపల బాధపడ్తూ, వసిగారు సీతారామయ్యగారు.

"బాబుగారూ! ఇవి చేతులు కావు. పెద్దలు. కాదనకుండా యీ మాత్రిం చిన్నసాయం చేసిపెట్టండి. పెద్దవారు- మీరు చెప్తే యెవ్వరూ కాదనరు. వయస్సులోవున్నవాళ్లు సాక్ష్యం రావడం కంటే మీరొస్తే నాకు చాలా లాభం. చిన్నమాట సాక్ష్యం చెప్పండి. మీకుఋణపడివుంటాను. పోలీసు వాళ్లు వెళ్లిపొమ్మనగానే మళ్లీ మిమ్మల్ని టాక్సీలో యింటిదగ్గర దింపి మరీవెళ్తాను. సరా? కాదనకండి...." టాక్సీడ్రైవరు సీతారామయ్య గారి రెండూ చేతులూ పట్టుకుని ప్రాధేయపడ్డాడు.

అతని కళ్లల్లోకి చూసిన సీతారామయ్యగారికి అతను మంచివాడే కాకుండా చదువూ, సంస్కారంవున్న వ్యక్తిలాగ కూడా అనిపించింది. మరి కాదనలేక పోయారాయన.

టాక్సీ పోలీసుస్టేషన్ ముందు ఆగింది.

డ్రైవర్ స్టేషన్ లోపలకి వెళ్లాడు. అయిదు నిమిషాలు పోయాక యిద్దరు పోలీసులొచ్చి, ఆమెను దిగమన్నారు. అంతకుముందు అంత మందిని మూడు చెరువుల నీళ్లుతాగించిన మనిషి ఎర్రటోపీ చూసేసరికి భయమేసిందికాబోలు- పిల్లిలా టాక్సీదిగి, తూలుతూ వాళ్ళతో బాటు స్టేషన్‌లోకి వెళ్లింది. అవసరమయిపిలిస్తే వెళ్లొచ్చునని సీతారామయ్యగారు టాక్సీలోనే వుండిపోయారు.

రెండు నిమిషాల తర్వాత ఆయనకోసం కూడా కబురొచ్చింది. లోపలకు వెళ్లారాయన.

డ్రైవరు చేతులు కట్టుకు నిలబడి వున్నాడు. గోడవారగా బల్లమీద ఆయువతి కూర్చొనివుంది. హాలుకి మధ్యగా పెద్దటేబుల్ వెనక కుర్చీలో

పిటపిట లాడుతున్న గంజి పెట్టిన కాకీ బట్టల్లో వున్న పోలీసోద్యోగి తన వైపు మొదట ఆశ్చర్యంగానూ, తర్వాత అదోలాగానూ చూడ్డం సీతారామయ్యగారికి ఆశ్చర్యం కలిగించింది.

"చూసారాసార్! మనిషి చూస్తే ఎలా వున్నాడో. అంత వయసొచ్చినా ఆబుద్ధులు చూడండి. ఈ మనిషి చూస్తే పరిస్థితి యిలావుంది. 'ఇక్కడికి పోనియ్యి, అక్కడికి పోనియ్యి' అంటూ మొత్తం వూరంతా తిప్పి, రెండు గంటల్నుంచీ నా దుంపతెంపేస్తున్నారు సార్. 'నేనింటికి పోవాలీ, మీటర్లో అయినంత మట్టుకు యిచ్చెయ్యండీ' అంటే - యీ మనిషేమో తాగుబోతు మాటలాడుతుంది. ఈయన గారేమో డబ్బుల్లేవంటాడు. చూస్కోండి యెలావుందో పరిపంచం...." అంటూ యింకా ఏదో చెప్పబోయిన టాక్సీ డ్రైవరు చటుక్కున పక్కకి తిరిగి ఆశ్చర్యంగా చూసాడు.

పోలీసోద్యోగి అయోమయంగా చూసాడు.

ఆడమనిషి జాలిగా చూసింది.

కాని - తన కాళ్ళల్లో పట్టు సడలి, చెవులు మొద్దుబారి, కళ్లు మసకలు కమ్మి, మెదడు దిమ్మెక్కి, గుండె స్తంభించి తను నేలకొరిగి పోతున్నట్లు సీతారామయ్యగారికి తెలీదు.

యువ డిసెంబరు '76.